క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


వెంకటేశ్వర్‌రావు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండల తహసీల్దార్‌గా ఎల్.వెంకటేశ్వర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ పద్మ కనగల్ మండలానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్‌రావుకు కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

గట్టుప్పల్ తహసీల్దార్‌గా రాములు



గట్టుప్పల్(చండూరు): గట్టుప్పల్ మండలం తహసీల్దార్‌గా కే.రాములు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ తహసీల్దార్ గా పనిచేసిన లావణ్య వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. చందంపేట మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న రాములు ఎన్నికల బదిలీలో భాగంగా గట్టుప్పల్‌కు వచ్చారు.

కట్టంగూర్ తహసీల్దార్‌గా ప్రసాద్



కట్టంగూర్: కట్టంగూర్ మండల తహసీల్దార్‌గా గుగులోతు ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ డి.స్వప్న బదిలీపై తిప్పర్తి మండలానికి వెళ్లారు. నకిరేకల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ప్రసాద్ బదిలీపై కట్టంగూర్‌కు వచ్చారు.

చిట్యాల తహసీల్దార్‌గా కృష్ణ



చిట్యాల: చిట్యాల తహసీల్దార్‌గా జి.కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలో భాగంగా కృష్ణ మల్కాజిగిరి జిల్లా నుంచి చిట్యాలకు వచ్చారు. చిట్యాల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జి.దశరథ చండూరుకు బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్ కృష్ణను వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నల్లగొండ డీఎస్పీగా శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం : నల్లగొండ డీఎస్పీగా కె.శివరాంరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి కోదాడకు బదిలీ అయ్యారు. శివరాంరెడ్డి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సీఐగా, ఎస్ఐగా విధులు నిర్వహించారు. రాచకొండ ఏసీపీగా విధులు నిర్వహిస్తూ నల్లగొండ డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

మున్సిపల్ కమిషనర్‌గా సంపత్‌కుమార్

రామగిరి(నల్లగొండ): నీలగిరి మున్సిపల్ కమిషనర్‌గా సంపత్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేటలో పనిచేస్తున్న సంపత్‌కుమార్ నీలగిరి మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారు. నేడు ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు పదోన్నతి

నీలగిరి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్‌కు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా జన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా అసిస్టెంగ్ కమిషనర్‌గా నీలగిరికి ఎవరినీ నియమించలేదు.

శాలిగౌరారం సీఐగా శ్రీనివాసరెడ్డి



శాలిగౌరారం: శాలిగౌరారం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చల్లాపురం శ్రీనివాసరెడ్డి బుధవారం నకిరేకల్‌లోని శాలిగౌరారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో సీఐగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాలిగౌరారం సీఐగా పనిచేసిన రాఘవరావు హాలియా సర్కిల్‌కు బదిలీ అయ్యారు. సీఐ శ్రీనివాసరెడ్డి బుధవారం సాయంత్రం మండలంలోని అడ్లూరు గ్రామంలో గల ప్రసిద్ధ శ్రీవీణగాణనృత్య సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి గతంలో శాలిగౌరారం ఎస్ఐగా పనిచేశారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

కనగల్: అమ్మగూడెం పంచాయతీ కార్యదర్శి సుంకిరెడ్డి నర్సింహారెడ్డి విధులకు హాజరు కాకుండా, అవినీతికి పాల్పడుతున్నాడని, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మాజీ సర్పంచ్ సింగం కోటేశ్, గ్రామస్తులు బుధవారం సూపరింటెండెంట్ అల్తాఫ్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మాజీ సర్పంచ్ సింగం కోటేశ్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి రిజిస్టర్‌లు, ఎంబీలు ఇంట్లో పెట్టుకుని, ఇంటి పన్ను వసూలు చేసి జీపీ అకౌంట్‌లో జమచేయకుండా సొంత ఖర్చులకు వాడుకుంటున్నాడని ఆరోపించారు. హార్టికల్చర్ రైతులు, జమానత్‌ల కోసం వెళ్లిన రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని, ఈ విషయాలపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై కార్యదర్శి నర్సిరెడ్డిని వివరణ కోరగా మాజీ సర్పంచ్ అవినీతికి పాల్పడుతూ విధులు సక్రమంగా నిర్వహిస్తున్న తనపై కుట్ర చేస్తున్నాడని అన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని, ఎలాంటి విచారణకు అయిన సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు దుబ్బ నాగరాజు, మండలి పరమేశ్, సైదయ్య, మాచర్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా గ్రామీణ లింక్ రోడ్లు !


అధ్వానంగా ఉన్న నెల్లిబండ - చందంపల్లి దారి


నోముల - ఇప్పలగూడెం మధ్యలో కంపచెట్లతో మూసుకుపోయిన రోడ్డు

- ఇరువైపులా కమ్మేసిన కంపచెట్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- బీటీగా మార్చాలని కోరుతున్న ప్రజలు

నకిరేకల్: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దశాబ్ద కాలంగా ఉన్న లింక్ రోడ్లను మెటల్ రోడ్లుగా మార్చకపోవడంతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామాన్ని కలిపే ఈ లింక్ రోడ్లకు మరమ్మతులు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా ప్రజలు, రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నకిరేకల్ మండలం నెల్లిబండ నుంచి చందంపల్లి, అడివి బొల్లారం, భూపతి కుంట గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. నెల్లిబండ నుంచి భూపతి కుంటకు వెళ్లే దారి అస్తవ్యస్తంగా మారింది. ఇరువైపులా కంపచెట్లతో మూసుకుపోతున్నాయి. మరోవైపు నెల్లిబండ నుంచి చందంపల్లి వరకు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వెంట ఉన్న ఈ రోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ దారి గుండా నకిరేకల్ మండలం నెల్లిబండ, చందంపల్లి, గొల్లగూడెం, అడివిబొల్లారం, భూపతికుంట, మిద్దెగూడెం ప్రజలు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏఎమ్మార్పీ కాల్వ వెంట ఉన్న ఈ దారి గుండా ఆయా గ్రామాల రైతుల వ్యవసాయ భూములు ఉన్నాయి. నిమ్మతోటలు కూడా ఎక్కువగా ఉన్నాయి. రైతులు ప్రతిరోజు తమ వ్యవసాయ భూముల వద్దకు, తోటల వద్దకు ఈదారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. మూడు కిలోమీటర్ల దారి గుంతలమయంగా మారింది. మోకాళ్లోతు గుంతలు ఏర్పడ్డాయి. మరోవైపు కంపచెట్లు కూడా పెరిగి దారిని కమ్మేస్తున్నాయి. ఇక నిమ్మతోటల రైతులు ప్రతి రోజు కాయలు తీసుకుని ఆటోల ద్వారా నకిరేకల్ నిమ్మ మార్కెట్‌కు వెళ్తారు. ఈ దారి గుండా ప్రయాణిస్తున్న క్రమంలో పెద్ద పెద్ద గుంతలు ఉండడంతో ఆటోలు పల్టీ కొడుతున్నాయి. సంబంధిత అధికారులు తక్షణమే నెల్లిబండ-చందంపలి, అడివి బొల్లారం, భూపతి కుంట రోడ్లను బీటీగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నోముల-ఇప్పలగూడెం మధ్యలో..

నకిరేకల్ మండలం నోముల-కేతేపల్లి మండలం ఇప్పలగూడెం మధ్య ఉన్న రెండు కిలోమీటర్ల లింక్ దారి అస్తవ్యస్తంగా ఉంది. ఈ దారిగుండా ఇటు నోముల, అటు ఇప్పలగూడెం ప్రజలు, వ్యవసాయదారులు, గీత కార్మికులు, కూలీలు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా వ్యవసాయ భూములు, తోటలు వేసిన రైతులు కూడా ఈ దారి నుంచే వెళతారు. మరోవైపు కల్లుగీత కార్మికులు కూడా తాటిట్లు ఎక్కేందుకు ఈ దారిని ఉపయోగిస్తుంటారు. రెండు కిలోమీటర్ల మేర ఉన్న నోముల-ఇప్పలగూడెం మధ్య లింకు దారి కంపచెట్లతో మూసుకుపోయింది. వర్షాకాలంలో వర్షం వస్తే ఈ దారిలో పూర్తిగా వర్షంనీరు నిలిచి బురదమయంగా మారుతుంది. ఈ దారిగుండా వెళ్లాలంటే రెండు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

మరమ్మతులు చేయడం లేదు



నెల్లిబండలోని ఏఎమ్మార్పీ కాల్వ నుంచి చందంపల్లి వరకు ఉన్న రోడ్డును పట్టించుకునే వారు లేరు. కనీసం మరమ్మతులు చేయడం లేదు.కంప చెట్లు నడిరోడ్డు మీదకు వస్తున్నాయి. మోకాళ్లోతు గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకల విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీటీ లేదా సీసీ రోడ్డు వేయాలి.

– పాలకూరి సైదులు, చందంపల్లి, నకిరేకల్ మండలం

కంపచెట్లతో రోడ్డు మూసుకుపోయింది



నెల్లిబండ నుంచి మా గ్రామానికి వచ్చే లింక్ రోడ్డు అధ్వానంగా ఉంది. దారి ఇరువైపులా కంపచెట్లతో మూసుకుపోయింది. మేము ప్రతి రోజు ఈదారి గుండానే నెల్లిబండ మీదుగా నకిరేకల్ మండల కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటాం. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనాలు దెబ్బతింటున్నాయి.

– వంగాల గోవిందర్‌రెడ్డి, భూపతి కుంట

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


నల్లగొండ టౌన్ : ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్ : కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైతులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని అఖిల భారత విప్లవ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల నర్సింహ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమ్మె కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మెరుగు వసంతకుమార్, జానపాటి శ్రీరాములు, కట్ట భిక్షం పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌కు మద్దతు

ఈ నెల 16న జరగనున్న దేశ వ్యాప్త గ్రామీణ బంద్‌కు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తోందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున బుధవారం ఒక ప్రకటనలోతెలిపారు. బంద్‌లో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రామగిరి(నల్లగొండ): ఈ నెల 16న కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గుర్రం వెంకట్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కార్యదర్శి బొమ్మిడి నగేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 16న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు నల్లగొండ క్లాక్ టవర్ నుంచి పాతబస్తీ, అంబేద్కర్ విగ్రహం, ప్రకాశం బజార్, మైసయ్య సర్కిల్, బస్టాండ్, రామగిరి మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు అయినా రైతాంగ కార్మిక సమస్యల పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో మోహ్మద్ మోహినుద్దీన్, దండంపల్లి సత్తయ్య, దొనకొండ వెంకటేశ్వర్లు, ఆర్ ఆచారి, సుంకిశాల వెంకన్న, అవుట రవీందర్, అన్నిమల్ల వెంకటేశం, పాణ్యం వెంకట్రావు, అద్దంకి నరసింహ, సలివోజు సైదాచారి, ఆవురేశు మారయ్య, షంబిరెడ్డి, లెనిన్, పోతెపాక సహదేవులు, లోడంగి ఉపేందర్, లతీఫ్, రవి, నాగరాజు, శోభన్‌బాబు, రావుల రవికుమార్, శ్రీనివాస్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. బుధవారం మండలంలోని మేటిచందాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అనంతల నరసింహ, లవంగి ముసలయ్య, పగిళ్ల అనురాధ, పగిళ్ల యాదగిరి, నీలకంఠం పద్మ, మానుపాటి మల్లమ్మ, బోడ సైదమ్మ, శశిరేఖ భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి కోరారు. చిట్యాలలో బుధవారం సమ్మె ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు రెడపాక మల్లయ్య, సిరిపంగి యాదయ్య, హెచ్చు సైదులు, మేడి శంకరయ్య, మంకాళి లింగయ్య పాల్గొన్నారు.

రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి విమర్శించారు. చిట్యాలలో బుధవారం జరిగిన చిట్యాల మండల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు సిరిపంగి యాదయ్య, మంకాల మల్లయ్య, మేడి శంకరయ్య, గోలి నర్సింహ, రాజమణి, పామనగుళ్ల రాములు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి


కట్టంగూర్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువత


నార్కట్‌పల్లి : నివాళులర్పిస్తున్న ఎన్‌పీఎస్ సభ్యులు

కట్టంగూర్: పుల్వామా ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారత జవాన్ల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కట్టంగూర్ మండలంలోని మునుకుంట్ల గ్రామంలో బుధవారం యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జవాన్ల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ముడుసు భిక్షపతి, నరేష్, తెలగమల్ల యాదగిరి, నూకబత్తుల నారాయణ, ఇప్పలపల్లి రవి, చిలుముల వెంకన్న, పోషబోయిన లింగస్వామి, రాహుల్, అభిలాష్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

నార్కట్‌పల్లి : జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన భారత జవాన్లకు బుధవారం రాత్రి నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తుతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. నోముల నాగరాజు, నడింపల్లి శ్రవణ్, గూడూరు అంజిరెడ్డి, పాలకూరి రమేష్, జమాండ్ల నవీన్‌రెడ్డి, ప్రవీణ్, గండికోట రాజు, కొరివి శంకర్, రాగిరి శివశంకర్, మునుకుంట్ల గణేష్, కన్నబోయిన నర్సింహ తదితరులున్నారు.

పగిడిమర్రిలో తీరిన తాగు నీటి కష్టాలు


బోర్‌మోటార్‌ను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ గోలి నర్సిరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కనగల్ : మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామంలో నెల రోజుల నుంచి తాగునీరు లేక అవస్థలు పడిన ప్రజలకు ఎట్టకేలకు నీటి కష్టాలు తప్పాయి. ఇటీవల పగిడిమర్రిలో తాగు నీటి తిప్పలు తప్పేనా అనే కథనం సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. స్పందించిన మంత్రి కోమటిరెడ్డి సంబంధిత అధికారులను గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు గ్రామానికి చేరుకుని మంగళవారం బోర్లు వేయించి నీటి కష్టాలను తీర్చినట్లు మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి, జగాల్‌రెడ్డి తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఆర్‌డబ్ల్యూ ఏఈ షఫీ, పంచాయతీ కార్యదర్శి చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

హెల్త్ కార్డులు ఇవ్వాలి

నల్లగొండ టౌన్: నాలుగో తరగతి ఉద్యోగులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్దం జ్ఞానేశ్వర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎనుగుల భిక్షమయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్, అసోసియేట్ అధ్యక్షుడు దాస్యానాయక్, కోశాధికారి ధన్‌రాజ్, జిల్లా కార్యదర్శి మేడి మణికుమార్, సహాధ్యక్షుడు బక్క రేణుక, కోశాధికారి సీహెచ్.సైదులు, మాజీ అధ్యక్షులు రాజమల్లయ్య, రాజయ్య, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని నాలుగో తరగతి ఉద్యోగులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): ఎన్జీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో మార్చి 27,28 తేదీల్లో నిర్వహించనున్న తెలుగు నాటక సాహిత్యం సమాజం జాతీయ సదస్సు కరపత్రాన్ని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సాహిత్యం పట్ల ఆసక్తిని పెంపొందించి వారిలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ మునీర్, డాక్టర్ అంతటి శ్రీనివాసులు, ఐక్యూఏసీ వైవిఆర్ ప్రసన్నకుమార్, అకడమిక్ కో ఆర్డినేటర్ వి.శ్రీనివాసులు, సీఓఈ బి.నాగరాజు, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ ఎస్.దీపిక, ఎస్.లవీందర్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్, ఎన్జీకళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తాం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

చిట్యాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లల్లో చేపట్టిన సంక్షేమ పథకాలను, విజయాలను ప్రజలకు వివరిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. చిట్యాలలో బుధవారం నిర్వహించిన నకిరేకల్ శాసనసభ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులతో కూడిన ఐదు బృందాలతో విజయ సంకల్ప యాత్రలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫీర్ ఏక్ బార్ మోదీ సర్కార్ నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి విజయసంకల్ప యాత్రలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి వచ్చిన పగుళ్లకు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో నకిరేకల్ నియోజకవర్గ ప్రభారి రవినాయక్, నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, జిల్లా ప్రధానకార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, జిల్లా అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు మాస శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కూరెళ్ళ శ్రీను, ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న విపస్య స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్


నల్లగొండలోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు


నల్లగొండలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న తల్లిదండ్రులు


నకిరేకల్: సాయి మందిరంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సరస్వతీ పూజ నిర్వహించి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుంధతి, ప్రధానోపాధ్యాయురాలు కట్టా అనితారెడ్డి, సమితి సభ్యులు దోసపాటి శ్రీనివాస్, కార్యదర్శి చిలుకూరి పరమాత్మ, పల్లెర్ల యాదగిరి, ప్రభాకర్, తిరందాస్ లక్ష్మీనారాయణ, ఎడ్ల తిరుమలేష్, రమేష్‌చారి, గోవింద్, సుధాకర్, మిట్టపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

విపస్య స్కూల్లో ..

నల్లగొండ: మున్సిపాలిటీ పరిధిలోని విపస్య స్కూల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సరస్వతి పూజలు నిర్వహించి నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులతో వేద పండితుల మంత్రోచ్ఛారణాల మధ్య ప్రిన్సిపాల్ గోపాల శ్రీనివాసరావు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో..

నల్లగొండలోని తులసీ నగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాసం, సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు చిన్నారులకు టాటా వాటర్ దొడ్ల డెయిరీ డిస్ట్రిబ్యూటర్ సామ ప్రభాకర్‌రెడ్డి వాటర్ బాటిల్స్, ఎనర్జీ డ్రింక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది శేఖర్, హనుమంతాచార్యులు, హరీష్, శివ ప్రసాద్, గోదాదేవి, శ్రీను రేపాల భద్రాద్రి రాములు, ఓరుగంటి పరమేశ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు యోగేష్ ప్రభు సరస్వతి పూజ, హోమం నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డు యాదగిరి, డైరెక్టర్ కన్నెబోయిన శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడెంలో..

నార్కట్‌పల్లి: మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో గల కృష్ణవేణి హైస్కూల్‌లో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పుడమి సాహితి వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్, ట్రస్మా కోశాధికారి డాక్టర్ ఎం.చెన్నయ్యగౌడ్, పాఠశాల చైర్మన్ మట్టా సవిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో..

నకిరేకల్ : వసంత పంచమి వేడుకలను బుధవారం నకిరేకల్ పట్టణంలోని సాయి మందిరంలో ఘనంగా నిర్వహించారు. సాయి మందిరంలో సరస్వతీ దేవి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్మన్ వనమా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి యాటా మధుసూదన్‌రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ, ప్రతినిధులు గట్టు శ్యాంసుందర్, వలిశెట్టి స్వప్న, బ్రహ్మదేర వేణు, కందగట్ల పవన్ తదితరులు పాల్గొన్నారు.


నార్కట్‌పల్లి : ఎల్లారెడ్డిగూడెంలోని కృష్ణవేణి హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకలు


చిట్యాల: అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు


నల్లగొండలో అక్షరాభ్యాసం వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

దర్వేశిపురం ఆలయంలో డీఎస్పీ ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కనగల్: నల్లగొండ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శివరాంరెడ్డి దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానంలో ఎస్ఐ రామకృష్ణతో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. డీఎస్పీకి ఆలయ సిబ్బంది పూలదండ వేసి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కనగల్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ సందర్శించి వివరాలు సేకరించారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌ను వచ్చిన డీఎస్పీని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ శాలువాతో సత్కరించారు.

బీజేపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

రామగిరి(నల్లగొండ): బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నల్ల గొండ పార్లమెంట్ ఇన్‌చార్జ్ చింతల రామచంద్రరెడ్డి హాజరయ్యారు. పార్లమెంట్ ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూకల నరసింహారెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

మర్రిగూడ: యరగండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్ అదుపుతప్పి కిందపడి గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యరగండ్లపల్లి గ్రామానికి చెందిన చామకూర శ్రీను మండల కేంద్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో మర్రిగూడ చౌరస్తా వద్ద కుక్క అడ్డురాగా తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు అటుగా వస్తున్న పోలీసు వాహనంలో మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు స్వల్ప గాయాలు కావడంతో ప్రస్తుతం మర్రిగూడ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

కార్యదర్శికి వినతి

నాంపల్లి : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘానికి చెందిన ఖాళీ స్థలంలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాంపల్లి పంచాయతీ కార్యదర్శి సయ్యద్ బాబాకు వినతిపత్రం అందజేశారు. టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సిలివేరు నారాయణ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు చందాలు వేసుకుని 360 గజాల భూమిని నాంపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదురుగా కొనుగోలు చేసి గ్రంథాలయ నిర్మాణం కోసం గ్రామ పంచాయతీకి అప్పగించామని తెలిపారు. ఆ స్థలంలో గ్రంథాలయం నిర్మించలేదన్నారు. కొందరు దళారులు రికార్డులు తారుమారు చేసి ఆ భూమిని వేరే వాళ్లకు అమ్మినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించారన్నారు. ఇటీవల ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆ స్థలాన్ని పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారని వివరించారు. ఉపాధ్యాయులు కత్తి కృష్ణారెడ్డి, పంతంగి విఠల్‌కుమార్, కురుపాటి సతీష్ పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో 58వ ర్యాంకు

రామగిరి(నల్లగొండ): ఇటీవల ప్రకటించిన గురుకుల ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో దేవరకొండ మండలం తూర్పుపల్లి పోట్యానాయక్ తండాకు చెందిన ఆంగోతు రవి రాష్ట్ర స్థాయిలో 58వ ర్యాంకు సాధించి పీజీటీ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రవి ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు.